# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ | శనివారం జులై 04 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## పోలీస్ శాఖలో పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

### ఆర్థిక శాఖ అనుమతులు మంజూరులిలి.. త్వరలో నోటిఫికేషన్ విడుదల..

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త అందించింది. తెలంగాణ పోలీస్ శాఖలో 5,000 ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆర్థిక శాఖ అనుమతులు మంజూరు కావడంతో నియామక ప్రక్రియ చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను త్వరలో తెలంగాణ పోలీస్ శాఖ విడుదల చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మొత్తం 10 విభాగాల్లో 5,000 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో అత్యధికంగా సివిల్ కానిస్టేబుల్ విభాగంలో 3,697 పోస్టులు ఉన్నాయి. ఆర్మ్డ్ రిజర్వ్ కానిస్టేబుల్ విభాగంలో 1,052 పోస్టులను భర్తీ చేయనున్నారు. అలాగే సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్) 148, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్మ్డ్ రిజర్వ్) 14, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ 12, సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి 3, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ 23, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ (ఏఆర్‌సీపీఎల్) 24, పోలీస్ కానిస్టేబుల్ డ్రైవర్ 20, మెకానిక్ (పీటీఓ) విభాగంలో 7 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. నియామకాలకు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, ఎంపిక ప్రక్రియ, పరీక్షల షెడ్యూల్ తదితర వివరాలను అధికారిక నోటిఫికేషన్‌లో వెల్లడించనున్నారు.

# రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే

### కేసీఆర్, హరీశ్‌రావు ప్రజలకు సమాధానం చెప్పాలి
### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంపై రూ.8.21 లక్షల కోట్ల అప్పుల భారం మోపారని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. తాము చేసిన అప్పులు, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్‌రావు ప్రజా ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారని ఆరోపించారు.

శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై హరీశ్‌రావు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో వివిధ మార్గాల ద్వారా రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని, రాష్ట్ర పరువు దెబ్బతినకూడదనే ఉద్దేశంతో ఇప్పటివరకు ఈ విషయాన్ని పదేపదే ప్రస్తావించలేదని తెలిపారు.

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీతో కలిపి రూ.2.08 లక్షల కోట్ల అప్పులను చెల్లించిందని భట్టి చెప్పారు. గత ప్రభుత్వం అధిక వడ్డీ రేట్లతో అప్పులు తీసుకురావడంతో రాష్ట్రంపై అదనపు భారం పడిందని, వడ్డీ భారాన్ని తగ్గించే చర్యల ద్వారా చెల్లించాల్సిన వడ్డీని రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గించామని వెల్లడించారు.

బీఆర్ఎస్ నేతలు చేసిన అప్పులను తక్కువ చేసి చూపే ప్రయత్నం చేస్తున్నారని, మాజీ మంత్రి హరీశ్‌రావు తన బాధ్యతలను మరచిపోయి ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియా వేదికగా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన వస్తువులు అందించాలనే ఉద్దేశంతో రూ.1,142 కోట్ల విలువైన టెండర్లు పిలిస్తే, వాటిని రూ.2 వేల కోట్ల అవినీతిగా చిత్రీకరించడం బాధ్యతారాహిత్యమని భట్టి అన్నారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పులపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా స్పందించాలని డిమాండ్ చేశారు.

సింగరేణి సంస్థను సంక్షోభంలోకి నెట్టిందీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించిన భట్టి విక్రమార్క, కొత్త కోల్‌బ్లాక్‌లు సాధించేందుకు ప్రస్తుత ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరుపుతోందన్నారు. సింగరేణి నుంచి బొగ్గు మాయమైందంటూ బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, వాటిపై విచారణ జరపాలని సంస్థ విజిలెన్స్ డైరెక్టర్‌ను ఆదేశించినట్లు వెల్లడించారు. సింగరేణిపై అసత్య ప్రచారం చేయడం వల్ల నష్టపోయేది రాష్ట్ర ప్రజలేనని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.



### కాంగ్రెస్--బీఆర్ఎస్ బహిరంగ చర్చకు

# బీజేపీ వేదిక సిద్ధం

### పాలన, అవినీతిపై ప్రజల ముందే వాస్తవాలు వెల్లడి చేస్తాం:బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలన, అవినీతి, టెండర్ల వ్యవహారాలపై పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య బహిరంగ చర్చ నిర్వహించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రెండు పార్టీలకు సమాన వేదిక కల్పించి పాలనా వైఫల్యాలు, అవినీతి ఆరోపణలు, టెండర్లలో జరిగిన అక్రమాలపై వాస్తవాలు, గణాంకాలు, ఆధారాలను ప్రజల ముందుంచే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రతిపాదించిన బహిరంగ చర్చకు పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు.

ఈ చర్చ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి అందించిన సహకారాన్ని కూడా ప్రజలకు వివరిస్తామని రామచందర్‌రావు పేర్కొన్నారు. అనంతరం నల్గొండ జిల్లాకు చెందిన రచయిత చింతా ముత్యాలరావు రచించిన లిలి‘ఫైటర్స్ అగైనెస్ట్ ఎమర్జెన్సీ ఇన్ నల్గొండ డిస్ట్రిక్ట్’లిలి పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) సమయంలో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బీజేపీపై నిరాధార ఆరోపణలు చేస్తోందని విమర్శించారు.

ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు గడిచినా, ఆ కాలంలో జైలు శిక్షలు అనుభవించిన వారు, హింసకు గురైన కుటుంబాలకు కాంగ్రెస్ ఇప్పటికీ క్షమాపణ చెప్పలేదని అన్నారు. అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ రాజకీయ ప్రత్యర్థులను, ప్రజాస్వామ్య శక్తులను అణచివేయడానికే ఎమర్జెన్సీ విధించారని ఆరోపించారు. ఎమర్జెన్సీ కాలంలో ఆర్‌ఎస్‌ఎస్, భారతీయ జనసంఘ్ కార్యకర్తలతో పాటు విద్యార్థులు, న్యాయవాదులు తదితరులు అరెస్టులు, వేధింపులకు గురయ్యారని, న్యాయవ్యవస్థపై కూడా ఒత్తిడి తెచ్చారని పేర్కొన్నారు. దేశ చరిత్రలోని ఈ చీకటి అధ్యాయం గురించి యువతతో సహా ప్రతి పౌరుడికి అవగాహన కల్పించడం మనందరి బాధ్యత అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో ఎమర్జెన్సీ చరిత్ర, దాని పాఠాలు విద్యా వ్యవస్థలో భాగమయ్యేలా చర్యలు చేపట్టారని రామచందర్‌రావు తెలిపారు.

### అప్పులపై అవగాహన లేని

# మంత్రి జూపల్లి

### జూపల్లి లేఖకు హరీశ్‌రావు ‘పీపీటీ’ కౌంటర్
### కాంగ్రెస్ అప్పులు రూ.4.50 లక్షల కోట్లు దాటాయి..
### నిండు అసెంబ్లీలో సీఎం రేవంత్ చెప్పిందే సాక్ష్యం
### బీఆర్ఎస్ హయాం మొత్తం అప్పు రూ. 4.17 లక్షల కోటు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు, గత బీఆర్ఎస్ హయాంలో జరిగిన అప్పులపై ఏమాత్రం అవగాహన లేకుండా ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు చీమూనెత్తురుంటే తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ శాసనసభా పక్ష నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వేదికగా సవాల్ విసరడంతో పాటు వాట్సాప్‌లో లేఖ రాయడంపై.. హరీశ్‌రావు సంగారెడ్డి వేదికగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ (ప్రూ) మరియు ఆర్‌బీఐ ఆధారాలతో అత్యంత ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. సొంత ప్రభుత్వం ఎన్ని అప్పులు చేసిందో కూడా తెలియని చేతకాని మంత్రి జూపల్లి అని ఆయన ఎద్దేవా చేశారు.

సంగారెడ్డిలో జరిగిన ఒక శిక్షణ కార్యక్రమ వేదికపై హరీశ్‌రావు ఉండగానే మంత్రి జూపల్లి నుంచి వాట్సాప్‌లో లేఖ వచ్చింది. దానిపై అప్పటికప్పుడు స్పందించిన హరీశ్ రావు.. ఆర్‌బీఐ అధికారిక వెబ్‌సైట్ పత్రాలను పీపీటీ ద్వారా ప్రదర్శిస్తూ జూపల్లి లెక్కలను తప్పుబట్టారు.

జూపల్లి లేఖలోని లెక్క: కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌బీఐ ద్వారా ఇప్పటివరకు కేవలం రూ.1,77,058 కోట్ల అప్పులు మాత్రమే చేసినట్లు జూపల్లి పేర్కొన్నారు.

హరీశ్‌రావు చూపిన ఆధారం: కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌బీఐ నుంచి ఎఫ్‌ఆర్‌ఎంబీ పరిమితి ద్వారా ఏకంగా 175 సార్లు అప్పులు తెచ్చి.. మొత్తం రూ.1,86,087 కోట్లు అప్పు చేసిందని ఆధారాలు చూపారు. మంత్రి జూపల్లి తన లేఖలో ఏకంగా రూ.10 వేల కోట్ల అప్పులను దాచి తక్కువగా చూపించారని మండిపడ్డారు.

**అప్పుల లొల్లి: ఎవరి లెక్కలు ఎంత? (హరీశ్‌రావు వెల్లడించిన వివరాలు):**

ప్రభుత్వం / సంస్థ లెక్కలు అప్పుల వివరాలు (రూపాయిల్లో) హరీశ్‌రావు చూపిన ఆధారాలు / వివరణ

బీఆర్ఎస్ హయాం మొత్తం అప్పు రూ. 4.17 లక్షల కోట్లు ఎఫ్‌ఆర్‌ఎంబీ, కార్పొరేషన్ల అప్పులు కలిపి ఇంతేనని కాగ్ (జూా+) నివేదిక కూడా స్పష్టం చేసింది.

కాంగ్రెస్ సర్కార్ అప్పు (ఫిబ్రవరి 2026 వరకు) రూ. 3,47,294 కోట్లు మార్చి 18, 2026న నిండు అసెంబ్లీ సాక్షిగా స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఒప్పుకున్న లెక్క.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం అప్పు రూ. 4.50 లక్షల కోట్లు దాటింది ప్రభుత్వం నడప డం చేతకాక, అప్పులు చేస్తూ బీఆర్ఎస్‌పై నిందలు వేస్తున్నారు అని అన్నారు.

“కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 2026 ఫిబ్రవరి వరకే రూ.3,47,294 కోట్ల అప్పులు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పారు. ఇప్పుడు ఆ అప్పు రూ.4.50 లక్షల కోట్లు దాటింది. కానీ జూపల్లి మాత్రం రూ.1.77 లక్షల కోట్లే అప్పు అని అబద్ధాలు రాస్తున్నారు. అసలు మీ ప్రభుత్వ అప్పులపై నువ్వు చెప్పింది కరెక్టా? నీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పింది కరెక్టా? జూపల్లి నిజంగా పాలమూరు బిడ్డవైతే తక్షణమే రాజీనామా చేయాలి” అని హరీశ్‌రావు సవాల్ విసిరారు. ఈ మేరకు జూపల్లికి బహిరంగ లేఖ విడుదల చేస్తూ, సంబంధిత అసెంబ్లీ వీడియోలను, ఆర్‌బీఐ గణాంకాలను మంత్రి వాట్సాప్‌కే హరీశ్‌రావు పంపించారు. ఉమ్మడి సంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కేసీఆర్ ప్రారంభించిన ‘సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలను’ కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా నిలిపివేసిందని హరీశ్‌రావు తీవ్రంగా ఆరోపించారు.

# కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. పోలీస్ ఉద్యోగాల కోసం పోటీ పడుతున్న యువతలో అధిక శాతం పేద, మధ్యతరగతి, గ్రామీణ కుటుంబాలకు చెందిన వారేనని, వారి ఆశలను వమ్ము చేయవద్దని కోరారు. శనివారం విడుదల చేసిన లేఖలో తెలంగాణ ఉద్యమ నినాదమైన “నీళ్లు, నిధులు, నియామకాలు” స్ఫూర్తికి అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించాలని కేటీఆర్ సూచించారు. నియామకాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు.

రాష్ట్రంలో 17 వేల పోలీస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వమే అంగీకరించినప్పటికీ, ఇప్పటివరకు వాటి భర్తీపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి, మంత్రులు వేలాది పోలీస్ ఉద్యోగాలు భర్తీ చేస్తామని పలుమార్లు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక హామీ ఇవ్వకుండానే 47 వేల పోలీస్ ఉద్యోగాలను భర్తీ చేశామని, మొత్తం 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసి, 1.60 లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసినట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

ఎన్నికలకు ముందు యువతకు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం పలు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించినప్పటికీ, రెండున్నరేళ్ల పాలనలో కేవలం 17 వేల ఉద్యోగాలనే భర్తీ చేసిందని విమర్శించారు. రాష్ట్ర యువత కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉందని పేర్కొన్న కేటీఆర్, ఎన్నికల హామీలను వెంటనే అమలు చేసి ఖాళీగా ఉన్న పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు.

# రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన డబుల్ రోడ్లు

### 2027 డిసెంబర్ నాటికి కొత్త హైకోర్టు, ఉస్మానియా ఆస్పత్రి పూర్తి చేయాలి
### మంత్రి కోమటిరెడ్డి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రెండేళ్లలో నాణ్యమైన ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్లను అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో శుక్రవారం ఆర్‌అండ్‌బీ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన శాఖ పనుల పురోగతిని సమీక్షించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అత్యాధునిక రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం సంకల్పించిందని మంత్రి పేర్కొన్నారు. తొలి విడతలో రూ.13 వేల కోట్ల వ్యయంతో 34 ప్యాకేజీల కింద 6,092 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం చేపడుతున్నామని, జూలైలోనే 10 ప్యాకేజీల పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. నల్లగొండ--మహబూబ్‌నగర్ డబుల్ రోడ్డు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం అనంతరం అవసరమైతే మూడు షిఫ్టుల్లో, రాత్రివేళల్లో కూడా రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి ప్యాకేజీకి అనుభవజ్ఞులైన ఇంజినీర్లను నియమించి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని చీఫ్ ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 6న కరీంనగర్ జిల్లాలో హ్యామ్, సీఆర్‌ఎఫ్ రహదారి పనులకు శంకుస్థాపన నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

రాజేంద్రనగర్‌లో నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవనం, న్యాయమూర్తుల నివాస సముదాయం నిర్మాణాన్ని 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం 16 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించగా, కార్మికుల సంఖ్య పెంచి మూడు షిఫ్టుల్లో పనులు నిర్వహించాలని ఆదేశించారు.

నూతన ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నిర్మాణాన్ని కూడా 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి ప్రారంభానికి సిద్ధంగా ఉందని, అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్, నిమ్స్ విస్తరణ, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు సాంకేతిక పరిజ్ఞానం, నిబద్ధత కలిగిన ఇంజినీర్లను నియమించాలని సూచించిన మంత్రి, పనుల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. త్వరలో నిర్మాణ ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని తెలిపారు. బాసర, భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులు, గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పురోగతిపైనా ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.

### ఇన్‌స్టాగ్రామ్‌లో
# చిన్నారులపై అభ్యంతరకర ప్రకటనలు..

### మెటాకు కేంద్రం సమన్లు
### వివరణ కోరనున్న కేంద్ర ప్రభుత్వం..



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

చిన్నారులపై లైంగిక దోపిడీని ప్రోత్సహించేలా ఇన్‌స్టాగ్రామ్‌లో అభ్యంతరకర ప్రకటనలు ప్రసారమవుతున్నాయన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటాకు సమన్లు జారీ చేసి వివరణ కోరాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ (మీవత్) అధికారులను కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఆదేశించారు.

బీబీసీ ప్రచురించిన ప్రత్యేక దర్యాప్తు కథనం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆ కథనంలో ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారులపై లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్‌ను ప్రోత్సహించే చెల్లింపు ప్రకటనలు ప్రసారమైనట్లు పేర్కొంది. “రేప్ వీడియో”, “చైల్డ్ వీడియో” వంటి పదాలతో ఉన్న ప్రకటనల ద్వారా వినియోగదారులను టెలిగ్రామ్ ఛానళ్లకు మళ్లించి, అక్కడ చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను విక్రయిస్తున్నట్లు ఆరోపించింది. ఈ ప్రకటనలు ఇన్‌స్టాగ్రామ్ మోడరేషన్ ప్రక్రియను దాటి ప్రసారమయ్యాయని కూడా నివేదిక వెల్లడించింది.

ఈ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని కోరుతూ మెటాకు నోటీసులు జారీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. సోషల్ మీడియా వేదికల ద్వారా బాలల లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్ ప్రచారం జరగడం అత్యంత తీవ్రమైన అంశమని అధికారులు పేర్కొన్నారు.

ఈ వ్యవహారంపై స్పందించిన మెటా, తమ కమ్యూనిటీ మార్గదర్శకాలకు అనుగుణంగానే ప్రకటనల పర్యవేక్షణ జరుగుతుందని తెలిపింది. విధానాలను ఉల్లంఘించే కంటెంట్‌పై నిరంతర చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది.

కాగా, వారం వ్యవధిలో మెటాకు కేంద్రం నోటీసులు జారీ చేయడం ఇది రెండోసారి. ఇటీవల వాట్సాప్‌లో యూజర్ ఐడీ ఫీచర్‌కు సంబంధించి కూడా కేంద్రం మెటాకు, అలాగే టెలిగ్రామ్‌కు నోటీసులు జారీ చేసింది. దీనిపై స్పందించిన వాట్సాప్, వినియోగదారుల భద్రతకు, ఆన్‌లైన్ మోసాల నివారణకు కట్టుబడి ఉన్నట్లు వెల్లడించింది.

# కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రితో సీతక్క భేటీ

### అంగన్‌వాడీలు, పోషకాహార పథకాలకు అదనపు నిధులు కోరిన రాష్ట్ర మంత్రిలిలి



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణాదేవితో శుక్రవారం న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న మహిళా, శిశు సంక్షేమ కార్యక్రమాలపై చర్చించి పలు వినతిపత్రాలు సమర్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న అల్పాహారం, పాలు పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని పేర్కొన్న సీతక్క, ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాలని కోరారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వేతనాల్లో ప్రస్తుతం కేంద్రం అందిస్తున్న 20 శాతం వాటాను పెంచాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో యుక్తవయస్క బాలికల్లో రక్తహీనత సమస్యను తగ్గించేందుకు ప్రత్యేక పోషకాహార కార్యక్రమం అమలు చేయనున్నట్లు వివరించిన మంత్రి, ఇందుకోసం రూ.100 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. తెలంగాణలో మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు కేంద్రం పూర్తి సహకారం అందించాలని సీతక్క విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అవసరాలకు సంబంధించిన పలు అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

## ఘట్‌కేసర్‌లో రైలు కిందపడి దంపతుల ఆత్మహత్య

### వ్యాపార భాగస్వాముల వేధింపులే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ



బలగం టీవి, హైదరాబాద్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి దంపతులు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపాయిపేట గ్రామానికి చెందిన రవికుమార్, శిరీష దంపతులు ఈ ఘటనలో మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు.

కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, ప్రస్తుతం పెద్ద అంబర్‌పేట్ మండలం కుంట్లూరులో నివసిస్తున్న రవికుమార్, శిరీష దంపతులు కొద్ది నెలల క్రితం తమ పరిచయస్తులైన నీలి వెంకటేశ్, ప్రియా దంపతులతో కలిసి రెడీ మిక్స్ వాహన వ్యాపారంలో భాగస్వాములయ్యారు. ఇందుకోసం రవికుమార్ రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వ్యాపారం ప్రారంభంలో కొంతకాలం సజావుగా సాగినా, గత రెండు నెలలుగా రావాల్సిన వాటా డబ్బులు ఇవ్వకుండా వ్యాపార భాగస్వాములు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. డబ్బుల గురించి ప్రశ్నించడంతో బెదిరింపులకు, మానసిక వేధింపులకు పాల్పడ్డారని కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం రాత్రి కూడా ఇదే విషయమై తీవ్ర వాగ్వాదం జరిగిన తర్వాత మనస్తాపానికి గురైన దంపతులు ఆత్మహత్యకు పాల్పడినట్లు వారు పేర్కొన్నారు. మృతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. తమ కుమార్తె కుటుంబంలో ఎలాంటి కలహాలు లేవని, వ్యాపార భాగస్వాముల వేధింపుల కారణంగానే ఈ దుర్ఘటన జరిగిందని శిరీష తల్లి లక్ష్మీ ఆరోపించారు. వ్యాపారం కోసం 16 తులాల బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టినప్పటికీ, ఒకసారి మాత్రమే రూ.20 వేల లాభం ఇచ్చి, అనంతరం డబ్బులు ఇవ్వకుండా వేధింపులకు పాల్పడ్డారని మృతుల బంధువు సారంగపాణి తెలిపారు.

# రైతులకు పారదర్శక సేవలు..

**విద్యుత్ సరఫరాలో నాణ్యత**

**-టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల, :**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచే లక్ష్యంతో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి శుక్రవారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు.మర్రిపల్లి సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ ను, వట్టెంల సబ్‌స్టేషన్‌లో 5 వీఏ అదనపు పీటీఆర్‌ను వరుణ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ

జిల్లాలో మంజూరైన 13 కొత్త సబ్‌స్టేషన్లలో ఇప్పటికే రెండు పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. విద్యుత్ అంతరాయాల నివారణకు మంజూరైన 19 బంచ్డ్ బ్రేకర్లలో 15 పూర్తయ్యాయని అన్నారు. వీటి ద్వారా లోడ్ పంపిణీ సులభతరం కావడంతో పాటు వోల్టేజ్ సమస్యలు తగ్గుతాయని అన్నారు.

?రైతులకు పారదర్శకమైన పద్ధతిలో కొత్త విద్యుత్ కనెక్షన్లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే, విద్యుత్ స్తంభాల మార్పిడి, మధ్యస్తంభాల ఏర్పాటు మరియు 33 కేవీ ఇంటర్‌లింక్ లైన్ల పనులను వేగవంతం చేయడం ద్వారా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు .

?వేములవాడ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎండీ, విద్యుత్ నష్టాలను తగ్గించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది విధి నిర్వహణలో 'వన్ మినిట్ సేఫ్టీ' నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు 1912 కాల్ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ టి. వేణుమాధవ్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.





## ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించండి..

**- డిఎంహెచ్వో డాక్టర్ జి.ఎం. జేలా అల్ఫ్రేడ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలందరూ ప్రతి శుక్రవారం 'డ్రై డే' విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.ఎం. జేలా అల్ఫ్రేడ్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణంలోని శాంతి నగర్ సందర్శించినారు.

ఈ సందర్భంగా జేలా అల్ఫ్రేడ్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు స్థానిక గ్రామ పంచాయతీ మరియు మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ముఖ్యంగా పాత టైర్లు, కొబ్బరి బొండాలు వంటి వాటిని తొలగించాలని సూచించారు. మురుగు గుంతలను పూడ్చివేయడంతో పాటు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ లేదా కిరోసిన్ వేయాలని అన్నారు. దోమల బారి నుండి రక్షణ పొందేందుకు పొడవు చేతుల దుస్తులు ధరించాలని ప్రజలకు సూచించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వెంటనే రక్త నమూనాలను సేకరించాలని, ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో ఎస్ హెచ్ జీ మహిళల ఉపాధికి మార్గం



**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,తంగళ్ళపల్లి:**

ఇందిరా మహిళా శక్తి యూనిట్లు మహిళా సంఘాల ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.ఇందిరా మహిళా శక్తి కింద తంగళ్ళపల్లి మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ) మహిళలు వెంకటసాయి కోల్డ్ ప్రెస్ ఆయిల్ ఢ ఫ్లోర్ మిల్ యూనిట్, కోవిదా మిల్క్ పాయింట్ ఏర్పాటు చేసుకోగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ప్రారంభించారు.

వాటి పని తీరు, ఉపాధి, ఆదాయం తదితర వివరాలను మహిళలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి కింద రెండు యూనిట్లు ప్రారంభించామని, ఒక యూనిట్లో కోల్డ్ ప్రెస్సింగ్ ఆయిల్, పిండి గిర్ని, ఇతర దాదాపు ఆరు యంత్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. దాదాపు రూ. 11 లక్షల 50 వేలతో యూనిట్ ప్రారంభించారని, దీనికి పీ ఎం ఎఫ్ ఎం ఈ కింద రూ . 3 లక్షల 50 వేల సబ్సిడీ అందుతుందని అన్నారు . అలాగే మరో మహిళ డైరీ యూనిట్ ను ఏర్పాటు చేసుకున్నారని, దీనికి మహిళా సంఘాల నుంచి దాదాపు రూ.5 లక్షల రుణం ఇప్పించామని తెలిపారు. ఇక్కడ ఇతర డైరీ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని,జిల్లాలో ఇలాంటి మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేసేందుకు మహిళలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. యూనిట్లు ఏర్పాటు చేయడంతో ఉపాధితోపాటు మహిళా సాధికారతకు దోహదం చేస్తుందనిఅన్నారు . నిన్న బ్యాంకర్ల సమావేశంలో ఇదే విషయంపై చర్చించి.. మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు . జిల్లాలోని గ్రామీణ మహిళా, పురుష అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆర్ సేథీ ఆధ్వర్యంలో అందుబాటులో ఉందని అన్నారు . శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా రాణించేందుకు వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ మల్లికార్జున రావు, ఏఎంసీ వైస్ చైర్మెన్ నర్సింగం, ఇంచార్జి తహసీల్దార్ మురళి, ఇంచార్జి ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ మీర్జా, సర్పంచ్ లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వ సహకారం అందిస్తాం..

**-ప్రభుత్వ విప్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రెస్ క్లబ్ కార్యవర్గం..**

**బలగం టీవీ, వేములవాడ :**

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-- హెచ్-143) వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాషా, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ ల నేతృత్వంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గజమాలలు తో ఘనంగా సత్కరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులను ఆది శ్రీనివాస్ శాలువాలు కప్పి సన్మానిస్తూ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పాత్రికేయులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలను నిష్పాక్షికంగా వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఐక్యంగా పనిచేస్తూ పాత్రికేయుల సంక్షేమం, వృత్తి విలువల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారం, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలోని ప్రెస్ భవనంలో వివిధ జర్నలిస్టు సంఘాల సభ్యులకు అవకాశం కల్పించాలని విప్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ సభ్యులు కొత్వల్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సిహెచ్ దేవరాజ్, విష్ణు,క్యాషియర్ పంపంరి నాగరాజు, జిల్లా రమేష్, ఫహద్, చౌటుపల్లి వెంకటేష్, దెబ్బేటి ప్రవీణ్, శ్రీరామోజు వేణు, సంటి రాజేందర్ షబ్బీర్, నవీన్, బూర్ల ప్రదీప్, బండి రజినికాంత్, బుర్ల సందీప్, లక్ష్మీనారాయణ, వేణు ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## గంభీరావుపేటలో ఆధునిక 'కేసీఆర్ రైతు మార్కెట్' నిర్మాణం

**-సొంత నిధులతో హామీ ఇచ్చిన కేటీఆర్**

**బలగం టీవీ, గంభీరావుపేట :**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో రైతాంగానికి, కూరగాయల వ్యాపారులకు ఇకపై కష్టాలు తీరనున్నాయి. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుండే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మరో గొప్ప నిర్ణయాన్ని ప్రకటించారు. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం సమీపంలో అత్యంత ఆధునిక సౌకర్యాలతో కూడిన 'కేసీఆర్ కూరగాయల మార్కెట్'ను తన సొంత నిధులతో నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు.

శుక్రవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసిన గంభీరావుపేట ప్రజాప్రతినిధులు, మండలంలోని రైతులు, చిన్న తరహా వ్యాపారులు ఎదుర్కొంటున్న రోజువారీ ఇబ్బందులను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎండ, వానలను సైతం లెక్కచేయకుండా వ్యాపారం చేయాల్సి వస్తున్న పరిస్థితులను వారు వివరించారు. స్థానిక నాయకుల విజ్ఞప్తిపై అత్యంత సానుకూలంగా స్పందించిన కేటీఆర్,

నిర్మాణానికి అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని ఆదేశిస్తూ, తన స్వంత ఖర్చులతో ఈ మార్కెట్ ను త్వరగా పూర్తి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ మార్కెట్ అందుబాటులోకి రావడం వల్ల, రైతులకు తమ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి ఒక సురక్షితమైన వేదిక దొరకడమే కాకుండా, పట్టణ ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉంటాయి.

కేటీఆర్ తీసుకున్న ఈ నిర్ణయంపై గంభీరావుపేట వాసులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. . ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి, వార్డు సభ్యులు గ్యార దేవరాజు, ఎగదండి స్వామి, రెడ్డి మల్ల రాజనర్సు, పిట్ట శ్రీమతి, అర్జున్, చిలుక ప్రశాంత్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు, చేరాల నిఖిల్ గౌడ్, ఈరవేణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





## ఐసీయూలో దేశ విద్యా వ్యవస్థ

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్**

**బలగం టీవి, హైదరాబాద్**

దేశ విద్యా వ్యవస్థ ఐసీయూలో ప్రమాదంలో ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పిలుపు మేరకు శుక్రవారం ఓయూలో మేడ శ్రీను అధ్యక్షతన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.గత 12 ఏండ్లుగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పలు పోటీ పరీక్షల్లో పేపర్ లీకులు చోటుచేసుకుంటున్నాయని, అలాగే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో జాప్యం కారణంగా దేశ యువత భవిష్యత్తు అనిశ్చితిలో పడిందన్నారు. ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలో పేపర్ లీక్ ఆరోపణలతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కాంగ్రెస్ పార్టీ, ఎన్ఎస్‌యూఐ, ఐవైసీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఫ్రంటల్ విభాగాలు కలిసి "ఛత్రోంకి గూంజ్" ఉద్యమాన్ని చేపట్టి కేంద్ర ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ఈ ఉద్యమం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పోటీ పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు జరగకుండా పటిష్టమైన తనిఖీ వ్యవస్థతో కూడిన బాధ్యతాయుత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీక్ మాఫియాతో ఆయనకున్న సంబంధాలపై సమగ్ర విచారణ జరపాలని,అన్ని పోటీ పరీక్షలు, నియామక ప్రక్రియల కోసం ప్రతి సంవత్సరం వార్షిక క్యాలెండర్ విడుదల చేసి, నిర్ణీత గడువులో నియామకాలు పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ యూనివర్సిటీ నాయకులు బట్టపోతుల మోహన్ కుమార్, బైరు రవీందర్, నిత్య రెడ్డి, రాణి రాథోర్, అభిలాష్, లోకేష్, అనిల్ నాయక్, అజయ్, వినయ్, అశోక్, గోవర్ధన్ పాల్గొన్నారు.

## భగీరథ్ బెయిల్ పిటిషన్ విచారణ జూలై 6కు వాయిదా

**పోక్సో కేసులో హైకోర్టు నిర్ణయం**

**బలగం టీవి, హైదరాబాద్**

పోక్సో కేసులో అరెస్టైన బండి సాయి భగీరథ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టు జూలై 6కు వాయిదా వేసింది. భగీరథ్ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ పోలీసులు దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా బాధితురాలి తరపు న్యాయవాది వాదనలు వినిపించేందుకు మరింత సమయం ఇవ్వాలని కోర్టును కోరారు. దీంతో తదుపరి విచారణను సోమవారం (జూలై 6)కు వాయిదా వేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ పోక్సో కేసులో హైదరాబాద్ శివార్లలోని ఫామ్‌హౌస్‌లలో ఓ మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలతో బండి సాయి భగీరథ్‌ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం బెయిల్ కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించారు. బెయిల్ పిటిషన్‌పై గత విచారణ సందర్భంగా పోలీసులను కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించగా, శుక్రవారం పోలీసులు తమ కౌంటర్‌ను సమర్పించారు. బాధితురాలి తరపు న్యాయవాది సమయం కోరడంతో విచారణను జూలై 6కు వాయిదా వేస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకుంది.



## రెజ్లర్లకు అండగా ఉంటా

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

**బలగం టీవీ, హైదరాబాద్**

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన తెలంగాణ క్రీడాకారులకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అండగా నిలిచారు. ఈ నెల 10 నుంచి 12 వరకు హర్యానా రాష్ట్రంలోని రోహతక్‌లో జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు తెలంగాణ నుంచి వివిధ విభాగాల్లో 10 మంది బాలికలు, 20 మంది బాలురు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులకు ఎమ్మెల్యే ట్రాక్‌సూట్లు, షఉస్ అందజేయడంతో పాటు పోటీలకు వెళ్లి రావడానికి అవసరమైన రవాణా ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి బంగారు పతకాలతో తెలంగాణకు పేరు తీసుకురావాలని ఆకాంక్షిం చారు. జాతీయ స్థాయితో పాటు అంతర్జాతీయ స్థాయి లోనూ రాణించే లక్ష్యంతో కృషి చేయాలని క్రీడాకారులకు సూచించారు.క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. వ్యాయామశాలల అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామశాలల నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. తమకు నిరంతరం ప్రోత్సాహం అందిస్తున్న ఎమ్మెల్యేకు రెజ్లర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మెన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, అధ్యక్షుడు సంతోష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అస్లాం, నసీర్ కూలకి, కాలియా, సలాం ఆమూది, ఖాలిద్ బామూస్, కోచ్‌లు వైష్ణవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సవాళ్లు విసిరి పారిపోవడం సీఎం రేవంత్‌రెడ్డి నైజం



**కాంగ్రెస్ మంత్రులు పలాయనవాదులు**

**మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

సవాళ్లు విసరడం, తొడగొట్టడం, తొండిచేయడం, చివరకు పారిపోవడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నైజమని, ఆయన మంత్రివర్గంలోని మంత్రులు పక్కా పలాయనవాదులని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన సవాళ్ల వ్యవహారంలో కాంగ్రెస్ మంత్రుల డొల్లతనం, సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థత ప్రజల ముందే బట్టబయలైందని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో పార్టీ సీనియర్ నేతలు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, కిశోర్‌గౌడ్, గౌతమ్‌ప్రసాద్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలకు సవాళ్లు విసిరిన కాంగ్రెస్ మంత్రులు చివరకు పోలీసులను అడ్డం పెట్టుకుని వెనక్కి తగ్గారని ఎద్దేవా చేశారు.

**హరీశ్‌రావు అరెస్టు దారుణం**

చర్చకు రాకుండా మాజీ మంత్రి హరీశ్‌రావు, ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్‌లను భారీ సంఖ్యలో పోలీసులతో అడ్డుకున్న ప్రభుత్వం, హరీశ్‌రావును డీసీఎం వాహనంలో నగరమంతా తిప్పి కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ చేసినా స్పందించకుండా ముగ్గురు మంత్రులు పోలీసుల వెనుక దాక్కొని పారిపోయారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సమాధానం చెప్పే ధైర్యం లేదని, ప్రజల దృష్టి మరల్చేందుకే అప్పుల పేరుతో బూటకపు రాజకీయాలకు తెరలేపిందని విమర్శించారు.

సవాల్ విసిరింది సీఎం రేవంత్‌రెడ్డి, దాన్ని స్వీకరించింది కేటీఆర్ అయినప్పటికీ మధ్యలో మంత్రి జూపల్లి కృష్ణారావు జోక్యం చేసుకుని మొదట తెలంగాణ భవన్‌కు వస్తానని, తర్వాత గన్‌పార్క్, అనంతరం ప్రెస్‌క్లబ్ అంటూ వేదికలు మారుస్తూ చివరకు వెనక్కి తగ్గారని వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. దీంతో ఆయన జోకర్‌లా మారారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న ప్రతి రూపాయి అప్పును మౌలిక వసతుల కల్పన, సాగు, తాగునీరు, విద్య, వైద్యం, రైతు సంక్షేమం వంటి ప్రజాప్రయోజన కార్యక్రమాలకే వినియోగించామని తెలిపారు.

గురుకుల పాఠశాలలు, హాస్టళ్ల యూనిఫామ్‌ల టెండర్లను చేనేత కార్మికుల సంస్థ టెస్కోకు ఇవ్వాలని చేనేత, జౌళి శాఖ మంత్రి కొండా సురేఖ స్వయంగా లేఖ రాసినప్పటికీ, టెండర్లను ఇతరులకు ఎందుకు కట్టబెట్టారో ప్రభుత్వం వెల్లడించాలని వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంత్రి రాసిన లేఖను బహిర్గతం చేయాలని కోరారు. మంత్రులకు తమ శాఖల్లో జరుగుతున్న పరిణామాలపై అవగాహన లేకుండా, అన్ని వ్యవహారాలు ముఖ్యమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయని ఆరోపించారు.

**రేవంత్‌రెడ్డికి రక్షణ కవచంలా బండి సంజయ్**

కేంద్ర మంత్రి బండి సంజయ్ తన బాధ్యతలను విస్మరించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రక్షణ కవచంలా వ్యవహరిస్తున్నారని వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందుల్లో పడిన ప్రతిసారీ ఆయన బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తూ ప్రభుత్వాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తాము లేవనెత్తిన ఆరోపణలు అసత్యమైతే వాటిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి బావమరిదికి అమృత్ టెండర్లలో లబ్ధి చేకూరిందన్న ఆరోపణలు, సింగరేణి వ్యవహారాలు, కంచ గచ్చిబౌలి భూముల అంశం, ఈడీ దాడులకు సంబంధించిన నివేదికలు వంటి అంశాలపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఆరు గ్యారెంటీలు, ఎన్నికల హామీలపై బహిరంగ చర్చకు సిద్ధమైతే, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను చర్చకు హాజరయ్యేలా తాము ఒప్పిస్తామని వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రకటించారు.



## అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి వలసలు..

**- విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తీసుకుంటున్న ప్రజాహిత నిర్ణయాలు నచ్చి అనేకమంది స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు .

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం తురుకాష్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ ఎస్‌కే హుస్సేన్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సయ్యద్ మోదిన్‌తో పాటు పలువురు గ్రామస్థులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారికి పార్టీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు.

?ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీపై ప్రజల నమ్మకం పెరుగుతోందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఎనిమిది మంది ఎంపీలను గెలుచుకోవడంతో పాటు మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల్లోనూ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుని పార్టీ సత్తా చాటిందని అన్నారు. వేములవాడ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నామని అన్నారు .

?సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ నిర్మాణం, మూసీ సుందరీకరణ, మెట్రో విస్తరణ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలను వేగవంతంగా చేపడుతున్నారని అన్నారు . కావున యువత, మేధావులు, సామాజిక కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీని వేదికగా చేసుకుని ముందుకు సాగాలని, పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరేలా చూడాలని పిలుపునిచ్చారు.

## ఆపరేషన్ ముస్కాన్ 12 విజయవంతం చేయాలి

**-ఈ నెల 31 వ తేదీ వరకు కార్యక్రమాలు**

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ 12 విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఆపరేషన్ ముస్కాన్ 12 పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం శుక్రవారం కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. తప్పిపోయిన, పారిపోయిన పిల్లలు బాల కార్మికులుగా మారిన వారిని సంరక్షించి వారి స్వస్థలాలకు చేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం ప్రతి సంవత్సరం జనవరి, జూలై నెలల్లో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నాయని తెలిపారు.ఇందులో భాగంగా ఈ నెల 1 వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. తప్పిపోయిన, పారిపోయిన పిల్లల్ని వెతికి పట్టుకునేందుకు ప్రభుత్వం నిర్దేశించిన దర్పన్ యాప్ ను వినియోగించాలని సూచించారు. అలాగే ప్రతి పోలీస్ స్టేషన్ నుండి మిస్సింగ్ చిల్డ్రన్ సంబంధిత సమాచారం తీసుకుని అన్ని విభాగాలు సమన్వయంతో వారిని గుర్తించేందుకు చేరదీసేందుకు కృషి చేయాలని తెలిపారు.అలాగే ఇటుక బట్టీలు, బేకరీ షాపులు, మెకానిక్ షాప్ లు, ఇండ్ల నిర్మాణ పనులు, వ్యవసాయ పనులు, ఇతర పనుల్లో బాల కార్మికులతో పని చేయించుకోవడం నేరమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై కఠినంగా వ్యవహరించాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారించాలని సూచించారు. అలాగే బాల కార్మికులుగా మారిన పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగిస్తూ వారికి కౌన్సిలింగ్ చేయాలని తెలిపారు.

ఆలయాల ప్రాంతంలో భిక్షాటన చేసే పిల్లలను ఖాళీగా తిరుగుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడే పిల్లలను గుర్తించాలని సూచించారు. వారిని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో చేర్పించాలని పేర్కొన్నారు. పిల్లల యొక్క బంగారు భవిష్యత్తు కోసం కౌన్సెలింగ్ నిర్వహించి విద్యారంగం వైపు వెళ్లేలా చూడాలని తెలిపారు. ఒకవేళ విద్య పట్ల ఆసక్తి లేకపోతే ఏదైనా శిక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయించాలని, ఐ టీ ఐ ఏటీసీ పాలిటెక్నిక్, న్యాక్ లాంటి సంస్థల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.బస్ స్టేషన్, బస్సులలో ఎవరైనా అనాథ పిల్లలు, మహిళలు కనపడితే 1098 లేదా181కు కాల్ చేయాలని రవాణా శాఖ ఆర్టీసీ డిపో మేనేజర్లకు, అందరూ ఆర్టీసీ సిబ్బందికి సూచించాలని తెలిపారు.

జిల్లా సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ, మున్సిపల్, దేవాదాయ శాఖ, స్వయం సహాయక సంఘాలు సమన్వయంతో పిల్లల సమాచారాన్ని అందించాలని వారి భవిష్యత్తు కోసం సహకరించాలని సూచించారు.బాల కార్మిక చట్టం అమలు కోసం లేబర్ ఆఫీసర్ తప్పనిసరిగా అన్ని ఎస్టాబ్లిష్మెంట్లను తనిఖీ చేయాలని సూచించారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అంజయ్య, సభ్యులు ఖాజా, ఐసీపీఎస్ మిషన్ వాత్సల్య సిబ్బంది కవిత, అంజయ్య గగన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పశువుల ఆరోగ్య పరిరక్షణ రైతుల పశు సంపద కాపాడుకోవాలి

**అనంతారం గ్రామ సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేష్**

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

పశువుల ఆరోగ్య పరిరక్షణ, గ్రామ రైతుల పశు సంపద కాపాడడమే ముఖ్యమని అనంతారం గ్రామ సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేష్ అన్నారు.ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామ రైతుల పశుసంపదను రక్షించే లక్ష్యంతో గ్రామ సర్పంచ్ వోల్లాల రజిత వెంకటేశం ఆధ్వర్యంలో లంపీ స్కిన్ వైరస్ నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ఆవులు, లేగదూడలకు ఉచితంగా లంపీ వైరస్ నిరోధక టీకాలు వేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ వోల్లాల రజిత వెంకటేశం మాట్లాడుతూ, పశువుల ఆరోగ్య పరిరక్షణ రైతుల ఆర్థికాభివృద్ధి ఎంతో ముఖ్యమని, ప్రతి రైతు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని పశువులకు టీకాలు వేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డాక్టర్ పూర్ణచంద్రిక, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు చిట్టి వెంకట రాజిరెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు



## స్తంభంపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం..

**బలగం టీవీ,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం స్తంభంపల్లి లో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వేములవాడకు చెందిన శ్రీ వర్ష కంటి దవాఖాన ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్య బృందం మాట్లాడుతూ.. కంటికి సంబంధించిన దగ్గర చూపు, దూరపు చూపు, తలనొప్పి, మెడ నొప్పులు వంటి సమస్యలతో పాటు కంటి పొరలు (మోతి బిందువు) తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. అంతేకాకుండా, పరీక్షల్లో అవసరమని గుర్తించిన వారికి కంటి ఆపరేషన్లను కూడా ఉచితంగా చేయిస్తామని వైద్యులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, ఉప సర్పంచ్ చంద్రగిరి అశోక్, నాయకులు చింతలకోట రామస్వామి గౌడ్, తంగళ్ళపల్లి మహేష్, చంద్రగిరి మల్లయ్య, తునికి మల్లేశం, వైద్య సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**




రాష్ట్ర ప్రభుత్వం ఎల్ ఆర్ ఎస్ కింద కల్పించిన రాయితీని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు, వాటి పురోగతి, రాయితీ తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నీటి పారుదల శాఖ, రెవెన్యూ శాఖ, మున్సిపల్, మండల పంచాయతీ అధికారులతో శుక్రవారం కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎల్ ఆర్ ఎస్ -2020 కింద దరఖాస్తుదారులకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజు లో 25 శాతం రాయితీ కల్పించిందని అన్నారు . ఈ నెల 31వ తేదీ వరకు రాయితీ పొందేందుకు అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఎల్ ఆర్ ఎస్ కింద జిల్లాలో మొత్తం 43,150 దరఖాస్తులు వచ్చాయని అన్నారు . వీటిలో 5,708 దరఖాస్తుదారులు ఫీజు చెల్లించి ప్రక్రియ పూర్తి చేసుకున్నారని 3, 316 దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయని,

6, 051 దరఖాస్తులు అధికారుల పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.జిల్లాలో 28,075 మంది దరఖాస్తులు రాయితీకి అర్హత సాధించి ఉన్నాయని, వాటికి నిర్ణిత ఫీజు చెల్లిస్తే క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేయాలని వివరించారు.దరఖాస్తుల స్క్రూటినీ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భూములు నీటి వనరుల బఫర్ జోన్ , నాలా, చెరువులు, హెరిటేజ్ బిల్డింగ్ లు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను తిరస్కరించాలని ఆదేశించారు.

**హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలి**

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండల పరిషత్ కార్యాలయాల్లోహెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాయితీ, దరఖాస్తు విధానం, పూర్తి వివరాలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని, అక్కడ ఒక సహాయకుడు కూడా అందుబాటులో ఉండాలని సూచించారు. ఎల్ ఆర్ ఎస్ కింద దరఖాస్తు చేసుకొని అర్హత ఉన్న వారికి ఎస్ ఎం ఎస్, ఫోన్ ద్వారా సమాచారం చేరవేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి,డీటీసీపీఓ అన్సారీ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్ట్ కార్మికుల నిరసన సెగ..




**-వేతనాలు పెంచాలంటూ ప్రగతి భవన్ ముట్టడికి సిరిసిల్ల కార్మికుల పయనం**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, వేములవాడ నర్సింగ్ కాలేజీలలో పనిచేస్తున్న శానిటేషన్ మరియు సెక్యూరిటీ కాంట్రాక్ట్ కార్మికుల కి కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ, కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు తరలివెళ్లారు.

?ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ప్రస్తుతం అందుతున్న వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం అత్యంత దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి కాయకష్టం చేస్తున్న తమ సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలను పెంచాలని, తమను గుర్తించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించడంలో విఫలమైతే, రాష్ట్రవ్యాప్త సమ్మెకు దిగుతామని, దీనివల్ల కలిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

?ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమేష్, దేవరాజ్, వెంకటేష్, నాగరాజు, రమేష్, గణేష్ మరియు పద్మారావులతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## కాటన్ పవర్లూమ్ కార్మికుల కూలీల పెంపు కోసం జులై 6న పోరుబాట

**-?వేతన ఒప్పందం ముగిసినా స్పందించని యాజమాన్యాలు..**

**-నిత్యవసరాల ధరల మోతతో కార్మికుల దుర్భర పరిస్థితి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**




కాటన్ వస్త్ర ఉత్పత్తిలో నిమగ్నమైన పవర్లూమ్ కార్మికుల కూలీల పెంపు విషయమై యాజమాన్యాలు చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, జులై 6న సోమవారం చేనేత వస్త్ర వ్యాపార సంఘం కార్యాలయం వద్ద భారీ ధర్నా చేపట్టనున్నట్లు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముశం రమేష్, జిల్లా అధ్యక్షులు కోడం రమణ లు తెలిపారు.శుక్రవారం

సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ముశం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మాట్లాడుతూ, కాటన్ వస్త్ర ఉత్పత్తికి సంబంధించి కూలీ ఒప్పందం గడువు ముగిసి చాలా కాలమైందని, అనేకసార్లు విన్నవించినా, నోటీసులు ఇచ్చినా యాజమాన్యాలు పెడచెవిన పెడుతున్నాయని అన్నారు .ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా నిత్యవసరాల ధరలు ఆకాశాన్నంటాయి. కానీ, పవర్లూమ్ కార్మికులకు చెల్లిస్తున్న కూలీ మాత్రం రోజుకు రూ. 300 కూడా దాటడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నమ్ముకున్న వృత్తిలో ఆదాయం లేక, ఇతర పనులకు వెళ్లలేక కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనం కూడా లేకపోవడంతో కార్మికులు పడుతున్న మనోవేదనను యాజమాన్యాలు గుర్తించాలని హితవు పలికారు.

అసంఘటిత రంగంలో ఉన్న తమ హక్కుల కోసం జులై 6న నిర్వహించబోయే ధర్నాను జయప్రదం చేయాలని,కార్మికులందరూ, ఆసాములు కూడా ఉదయం 9 గంటల కల్లా సిఐటియు కార్యాలయానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు అన్నదాత గణేష్‌తో పాటు పలువురు కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

## ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించండి..



**-తహశీల్దార్‌కు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విజ్ఞప్తి**

**బలగం టీవీ, బోయినిపల్లి, :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని, ప్రజలకు ఈ అంశంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. ఈ మేరకు స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి బోయినిపల్లి తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి గ్రామంలో బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఏలను సమన్వయం చేసుకుని, ఓటరు నమోదు ఫారాలను ఎలా నింపాలో ప్రజలకు స్పష్టంగా వివరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. నమోదు ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఈ క్రమంలో మల్కాపూర్ గ్రామానికి చెందిన తుంటి మధుకర్ ఇంటికి వచ్చిన ఫారంలో చిరునామా వంటి వివరాలు సరిచూసుకోకుండా ఆన్‌లైన్ నమోదు చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే, స్థానిక వైద్యుడు భీమనాథుని రమేష్ నింపిన ఫారాన్ని అధికారులకు చూపుతూ, సరైన అవగాహన లేక చాలామంది ప్రజలు ఇలాంటి తప్పులు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి, అధికారులు తమ సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చి, బి.ఎల్.ఓల ద్వారా ప్రతి గ్రామంలో ప్రజలకు ఓటరు నమోదు ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కోరారు.

?ప్రభుత్వం విధించిన గడువులో ఇప్పటికే ఎనిమిది రోజులు పూర్తయినా, ఇంకా అనేక చోట్ల పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో ఫారాలు పెండింగ్‌లో ఉన్నాయనిఅన్నారు . ఈ పరిస్థితుల్లో నిర్ణీత గడువు సరిపోదని, ప్రజలందరికీ అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం ఓటరు నమోదు గడువును మరికొంత కాలం పొడిగించాలని డిమాండ్ చేశారు.

?ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, నాయకులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, కొంకటి శేఖర్, అక్కెనపెల్లి కర్ణాకర్, బత్తిని కమల్ గౌడ్, బోయిని రాజు, భీమనాథుని రమేష్, జంగిడి సంజీవ్, తుంటి మధుకర్, మధు తదితరులు పాల్గొన్నారు.